ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
3
మంగళవారం 31 డిసెంబరు 2024







## కదం తొక్కిన అంగన్‌వాడీలు

**జనవరి 3:** గౌరవ వేతనం రూ.26 వేలు, పదవి విరమణ తరువాత రూ.10 లక్షలు ఇవ్వాలనే డిమాండ్లతో అంగన్‌వాడీలు కార్య కర్తలు కదం తొక్కారు. కర్నూలు, నంద్యాల కలెక్టరేట్‌ను ముట్టడించారు. అంతకు ముందు 22 రోజులు రిలే దీక్షలు చేశారు.

## దేవరగట్టు కర్రల సమరం



**అక్టోబరు 13:** దేవరగట్టులో దసరా విజయ దశమి ఉత్సవాల్లో భాగంగా బన్ని జైత్రయాత్ర మహోత్సవం (కర్రల సమరం) నిర్వహించారు. ఈ ఉత్సవంలో 79 మంది గాయపడ్డారు. కర్రల సమరం చూసేందుకు వచ్చిన ముగ్గురు కర్ణాటక యువకులు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు.



# జ్ఞాపకాలు అనుభవాలు




కర్నూలు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):

కాలగమనంలో ఓ వసంతం కరిగిపోతోంది. ఎన్నో తీపి, మధుర జ్ఞాపకాలను 2024 సంవత్సరంలో వదిలిపోతోంది. ఐదేళ్ల వైసీపీ పాలనకు అంతం పలికి... కూటమి ప్రభుత్వానికి స్వాగతం పలికిన ఏడాదికి ఈరోజే ఆఖరు. గడిచిన 12 నెలల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎన్నో సంఘటనలు మరెన్నో మధురానుభూతుల... ఇంకెన్నో సంగతులు, కీలక ఘట్టాలు. నిన్నటి ఘనతలు స్మరించుకుంటూ గతించే ఏడాదికి వీడ్కోలు పలుకుతూ.. కోటికాంతులతో వికసించే 2025 సంవత్సరం ఎన్నో ఆశలతో, ఆకాంక్షలతో ఆహ్వానం పలుకుతున్న వేళ.. 2024 మిగిల్చిన కీల సంఘటనల, అనుభవాల సమాహారమే ఈ అక్షర రూకపం.




- మదిలో పదిలపరుచుకున్న మధుర జ్ఞాపకాలెన్నో..
- మిగిల్చిన చేదు అనుభవాలు..
- 2024కు వీడ్కోలు పలుకుతూ..
- కొంగొత్త ఆశలతో 2025 నవ వసంతంలోకి అడుగులు వేస్తూ...

## తూర్పున చంద్రబాబు.. పశ్చిమాన భువనేశ్వరి

**జనవరి 8:** ఆళ్లగడ్డలో రా కదలిరా..! సభలో అధినేత చంద్రబాబు, కోడుమూరులో నిజం గెలవాలి..! అంటూ నారా భువనేశ్వరి దంపతులిద్దరు ఒకే రోజు ఉమ్మడి కర్నూలులో పర్యటించారు. 28న పత్తికొండ రా కదలిరా..! సభలో చంద్రబాబు పాల్గొన్నారు.. తెలుగు తమ్ముళ్లలో జోష్ నింపారు.



## జగన్‌పై చెల్లి షర్మిల నిప్పులు

**జనవరి 29:** రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా కర్నూలులో పర్యటించిన వైఎస్ షర్మిల అన్న జగన్ పాలనపై నిప్పులు చెరిగారు.



**జూలై 7:** నందికొట్కూరు నియోజకవర్గంలోని ఓ గ్రామంలో 8 ఏళ్ల చిన్నారి అదృశ్యం అయ్యింది. అత్యాచారం చేసి హత్య చేశారని పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలో ఓ నిందితుడు ఆత్మహత్య చేసుకున్నాడు.



**మే 11:** సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదోని పట్టణంలో పర్యటించారు.

**మే 11 :** నంద్యాలలో రాజ్ థియేటర్ సర్కిల్‌లో అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు చివరి రోజు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. జగనన్న భూ హక్కు చట్టాన్ని రద్దు చేస్తామని ప్రకటించారు.

**జూన్ 4:** ఓటరన్న తీర్పు వెలువడిన రోజు. ఉమ్మడి జిల్లాలో కర్నూలు, నంద్యాల పార్లమెంట్ స్థానాలు సహా 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ విజయకేతం ఎగుర వేసింది. 1985 తరువాత 40 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టింది. రెండు స్థానాలతో వైసీపీ సరిపుచ్చుకుంది.

**జూన్ 12:** రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబుతో పాటుగా ఉమ్మడి జిల్లా నుంచి నంద్యాల, బనగానపల్లె, కర్నూలు ఎమ్మెల్యేలు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్ధన్‌రెడ్డి, టీజీ భరత్‌లు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు.



## ఓటర్ల తీర్పు

**మే 13:** లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటరు తీర్పు ఇచ్చిన రోజు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో 76.45 శాతం ఓటర్లు ఓటు వేశారు.



## పారిశ్రామిక శోభ

**జూలై 23:** ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్-2024-25 ప్రసంగంలో తీపి కబురు చెప్పారు. ఫేజ్-1 కింద 2,612 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేశారు. ఇక్కడికి జపనీస్ సంస్థ సెమికండక్టర్ పరిశ్రమతో పాటు డ్రోన్ తయారీ పరిశ్రమలు రాబోతున్నాయి.

## కృష్ణమ్మకు జలహారతి

**జూలై 31:** సీఎం చంద్రబాబు శ్రీశైలం ప్రాజెక్టును సందర్శించారు. కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. రికార్డు స్థాయిలో 1,573 టీఎంసీల వరద శ్రీశైలం డ్యాంకు చేరింది. తరువాత మరమ్మతులకు ఫేజ్-1 కింద రూ.102.58 కోట్లు మంజూరు చేశారు.



## శ్రీశైలానికి సీప్లేన్

**నవంబరు 9:** శ్రీశైలం పాతల గంగలో సీప్లేన్ ల్యాండ్ అయ్యింది. విజయవాడ నుంచి శ్రీశైలంకు సీప్లేన్‌లో సీఎం చంద్రబాబు ప్రయాణించారు. దేశంలో సీప్లేన్ టూరిజానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారు.



**అక్టోబరు 17:** కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్‌లో యురేనియం అంచనాలో భాగంగా 68 బోర్లు తవ్వకాలకు కేంద్ర అటవి శాఖ అనుమతి ఇవ్వడంతో యురేనియం కలకలం రేపింది. సేవ్ కప్పట్రాళ్ల..! అంటూ 15 గ్రామాలు రోడ్డెక్కారు. పది రోజులకు పైగా ఆందోళన చేశారు. దిగివచ్చిన ప్రభుత్వం అనుమతి ఉప సంహరించుకుంది.





## కొట్టుకుపోయిన తుంగభద్ర గేటు

**ఆగస్టు 10:** రాయలసీమ జీవనాడి తుంగభద్ర డ్యాం 19వ క్రస్ట్‌గేట్ చైన్‌లింక్ తెగిపోయి కొట్టుకుపోయింది. సీఎం చంద్రబాబు తక్షణమే ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్స్ నిపుణుడు కన్నయ్యనాయుడును పంపించి స్టాప్‌లాగ్ ఏర్పాటు చేసి 30 టీఎంసీలు కడలిపాలు కాకుండా కాపాడారు.

## అల్లు అర్జున్‌పై కేసు నమోదు

**మే 11 :** సినీ హీరో అల్లు అర్జున్, నంద్యాల ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డిపై నంద్యాల రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ జనసమీకరణలో పాల్గొన్నట్లు అప్పట్లో ఆయనపై కేసు నమోదు కావడం సంచలనమైంది.



# రామ్‌కో వద్ద రైతుల ధర్నా

## అనుమతి లేదని అడ్డుకున్న పోలీసులు



ధర్నా నిర్వహిస్తున్న రైతులు

కొలిమిగుండ్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రామ్‌కో సిమెంటు పరిశ్రమ కాలుష్యం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు రామ్‌కో సిమెంట్ పరిశ్రమకు వెళ్లే ప్రధాన రహదారిలో సోమవారం ధర్నాకు దిగారు. పరిశ్రమ యాజమాన్యం తమకు జరిగిన నష్టానికి సమాధానం చెప్పాలని రైతులు రహదారిలో బైఠాయించి, వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. దీంతో పదుల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. రైతులు నిరసనకు దిగిన కాసేపటికే పోలీసులు వచ్చి మీకిచ్చిన సమయం అయిపోయిందని వెళ్లి పోవాలంటూ ఆదేశించారు. కంపెనీ ప్రతినిధులు వచ్చి మాట్లాడే ప్రయత్నం చేయగా రైతులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ ఉన్నతాధికారులు వచ్చి సమాధానం చెప్పాలని అక్కడే బైఠాయించారు. దీంతో సీఐ రమేష్‌బాబు జోక్యం చేసుకొని వాహనాల రాకపోకలను అడ్డుకొని ధర్నా చేయడానికి అనుమతి లేదని, రైతులను అక్కడి నుంచి బలవంతంగా పంపించేశారు.

**విఫలమైన రైతుల ధర్నా:** డిసెంబరు 30న రామ్‌కో సిమెంట్ పరిశ్రమకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరగనుంది. ఈలోపు తాము ఎదుర్కొంటున్న కష్టాలు, తమ బాధను కంపెనీ దృష్టికి తీసుకరావాలని కొలిమిగుండ్ల, మీర్జాపురం, కల్వటాల, కోటపాడు గ్రామాలకు చెందిన రైతులు భారీ నిరసనకు శ్రీకారం చుట్టారు. డిసెంబరు 30న సుమారు 300 మంది రైతులతో ధర్నాకు అనుమతివ్వాలని తహసీల్దార్ కార్యాలయంలోనూ, పోలీస్ స్టేషన్‌లోనూ వారం రోజుల క్రితమే రైతుల కమిటీ విజ్ఞప్తి చేసుకున్నారు. అయితే రెండు రోజుల్లో పరిస్థితి మారిపోయింది. వివిధ రాజకీయ పార్టీల నాయకులు ధర్నాకు వెళ్లరాదంటూ రైతులపై ఒత్తిడి చేశారు. మరోవైపు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో రైతుల ధర్నా విఫలమైంది.







## ప్రజా వినతులను సరిగా పరిష్కరించండి: కలెక్టర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులకు అత్యంత ప్రాముఖ్యతనిచ్చి ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించి ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి స్వీకరించిన 18 దరఖాస్తులను పరిష్కరించాలని అన్నారు. అందులో మూడు దరఖాస్తులు రీ ఓపన్ అయ్యాయని, వీటిని కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏపీసేవా సర్వీసులను కూడా క్లియర్ చేయాలన్నారు. రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు సంబంధిత డాక్యుమెంట్లను కూడా అప్‌లోడ్ చేయాలన్నారు. ఫిర్యాదుల స్వీకరణకు ముందు కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ కార్యకలాపాలకు సంబంధించిన దస్త్రాలన్నీ ఈ-ఆఫీస్ ద్వారా సిగ్నేచర్ లేకుండా వస్తున్నాయని, ఈ-ఫైలింగ్ విధానంపై పూర్తిస్థాయి అవగాహన పొంది ప్రతి ఫైలు ఈ - ఆఫీసు ద్వారానే రావాలన్నారు. కార్యక్రమంలో 199 మంది అర్జీదారులు కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. కలెక్టర్‌తో పాటు జేసీ విష్ణుచరణ్, డీఆర్‌ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ

నంద్యాల క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు నంద్యాల జిల్లాలోని అన్ని పోలీస్ సబ్ డివిజన్లలో పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకంపై ఇబ్బంది అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు. సోమవారం జిల్లా కేంద్రమైన నంద్యాలలో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ముఖ్య అతిథిగా పాల్గొని హెల్మెట్ ధరించి ప్రారంభించారు. ఈ ర్యాలీ టెక్కె మార్కెట్ యార్డు నుంచి ప్రారంభమై సాయిబాబానగర్, ప్రభుత్వ ఆసత్రి, పద్మావతినగర్, మున్సిపల్ ఆఫీస్, సంజీవనగర్‌గేట్, ఆర్టీసీ బస్టాండ్, శ్రీనివాససెంటర్, గాంధీచౌక్‌మీదుగా తిరిగి టెక్కె మార్కెట్‌యార్డుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడంవల్ల అనుకోని ప్రమాదాలు ఎదురైనప్పుడు ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.



హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



## దేహ దారుఢ్య పరీక్షలు ప్రారంభం

వివరాలు 6లో

# సీఐల పదోన్నతి జాబితా సిద్ధం

కర్నూలు క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సీఐల పదోన్నతికి రంగం సిద్ధమైంది. డీఎస్పీలుగా పదోన్నతి పొందేందుకు అర్హులైన సీఐల జాబితాను సిద్ధం చేయాలని రాష్ట్ర డీజీపీ ద్వారక తిరుమలరావు జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు 155 మంది పేర్లతో కూడిన సీఐల జాబితాను ఆయా జిల్లాలకు పంపారు. కర్నూలు రేంజ్ పరిధిలో 40 మంది సీఐలు డీఎస్పీలుగా పదోన్నతి పొందే జాబితాలో ఉన్నారు. ఈ జాబితాలో ఉన్న వారి సమగ్ర వివరాలు పంపాలని డీజీపీ ఆదేశించారు. వారిపై ఉన్న ఏసీబీ కేసులు, సస్పెన్షన్లు తదితర వివరాలతో కూడిన సమగ్ర వివరాలు పంపాలని డీజీపీ ఆదేశించారు. ఈ జాబితా ప్రకారం సుమారు 50 నుంచి 60 మంది దాకా సీఐలు డీఎస్పీలుగా పదోన్నతి పొందే అవకాశం ఉంది. జనవరి 10వ తేదీలోపు వారి వివరాలు పంపాలని డీజీపీ ఆదేశించారు.

## మల్లన్న సేవలో ప్రముఖులు

శ్రీశైలం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను సోమవారం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సతీమణి సుధాదేవ్ వర్మ కుటుంబ సమేతంగా కలసి దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న ఆమెకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె ఆలయంలోనికి ప్రవేశించి రత్నగర్భ గణపతి స్వామిని దర్శించుకుని స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని దర్శించుకున్నారు. అనంతరం భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీర్వచన మండపంలో ఆమెకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈఓ ఎం.శ్రీనివాసరావు స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.



స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో శ్రీనివాసరావు

# టమోటా ధర పతనం

- 30 కేజీల బాక్స్ రూ. 60
- రవాణ ఖర్చులకు సరిపడని ధర
- అప్పుల బాధలో రైతు



టమోటా పొలం

గోనెగండ్ల, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా టమోటా రైతు పరిస్థితి దయనీయంగా మారింది. కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక పోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. దరలు ఇలాగే కొనసాగితే పెట్టుబడి కూడా చేతికి అందక అప్పులు పాలు వావాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఎంతో ఆశతో రైతులు టమోటా సాగు చేశారు. సాగు ప్రారంభంలో ధరలు బాగా ఉండటంతో కంటికి రెప్పలా పంటను కాపాడుకున్నారు. పంట చేతికి అందే సమయానికి ధరలు పూర్తిగా పడిపోయాయి. ఎమ్మిగనూరు మార్కెట్ లో 30 కేజీల బాక్స్ ధర రూ. 60 నుంచి రూ. 70 లోపే ధర పలుకుతోంది. దీంతో రవాణా ఖర్చులు, పెట్టుబడులు కూడా చేతికి అందేలా కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. గోనెగండ్ల నుంచి ఎమ్మిగనూరుకు బాక్స్‌కు రూ. 20 ఆటో చార్జి, మార్కెట్ దగ్గర హమాలీ కూలీ, కమీషన్ అంతా కలిపి బాక్స్‌కు మరో రూ. 20 పడుతుంది. మొత్తం ఒక బాక్స్‌కు రూ. 40 పోగా రైతు చేతికి బాక్స్ అమ్మితే రూ. 20 చేతికి అందుతుంది.



ఎమ్మిగనూరు మర్కెట్‌కు వ్యాన్‌లో తరలించేందుకు సిద్ధంగా ఉంచిన టమోటా బాక్స్‌లు

### 2000 ఎకరాల్లో టమోటా సాగు

ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు మండలాల్లో దాదాపు బావులు బోర్లు కింద 2వేల ఎకరాల్లో టమోటా పంటను సాగు చేశారు. ఎకరం పంట పెట్టుబడికి దాదాపు రూ. 50 వేల నుంచి 55 వేల వరకు ఖర్చు అవుతుంది.



### దిగుబడి ఉన్నా ధర లేదు

నేను ఐదున్నర ఎకరాల్లో టమోటా పంటను సాగు చేశాడు. ఎకరాకు రూ. 50వేల వరకు పెట్టుబడి పెట్టాను. దాదాపు రూ. 3 లక్షల ఖర్చు వచ్చింది. ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తున్నది. కోత కూలీలకు రూ. 250 నుంచి రూ. 300 వరకు ఇవ్వాలి. సోమవారం ఎమ్మిగనూరు మార్కెట్‌లో 70 బాక్స్‌లు అమ్మితే కూలీ డబ్బులు కూడా రాలేదు. మరో రూ. 2000 అప్పు చేయాల్సి వచ్చింది.

- గొల్ల శివన్న, టమోటా రైతు గోనెగండ్ల

### ప్రభుత్వం టమోటా రైతును ఆదుకోవాలి

టమోటా ధర పలకడం లేదు. రైతుల చాలా ఇబ్బందులు పడుతున్నారు. ధర లేక పోవడంతో చాలా మంది రైతులు పొలంలోనే పశువులకు మేతగా వేస్తున్నారు. భారీగా పెట్టుబడి పెట్టి సాగు చేస్తే కూలీ డబ్బులు కూడా రావడం లేదు. ప్రభుత్వం టమోటాకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి.



కేజి రూ. 10 ప్రకారం గ్రామాల్లో తిరిగి అమ్మకాలు జరుపుతున్న వ్యాపారి

## పత్తికొండ మార్కెట్‌లో టమోటా

పత్తికొండ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పత్తికొండ మార్కెట్‌లో సోమవారం టమోటా ధర తగ్గుముఖం పట్టింది. నిన్న మొన్నటి వరకు కిలో కనిష్ఠం రూ.8, గరిష్ఠంగా రూ.15 దాకా పలికింది. కాగా సోమవారం రూ.5 నుంచి రూ.12 చొప్పున వ్యాపారులు టమోటాను కొనుగోలు చేశారు. కాగా ఎర్రగా పండిన టమోటాలను వ్యాపారులు మొదట 10 కిలోల జత గంపలు రూ.50కి కొన్నారు. మార్కెట్ యార్డు అధికారులు వ్యాపారులతో మాట్లాడి రూ.100కు కొనుగోలు చేయించారు. కాగా దోరగా మాగిన టమోటాను వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసినా వారితో మాట్లాడి రైతుకు గిట్టుబాటు ధర అందేలా చర్యలు తీసుకుంటున్నామని మార్కెట్ యార్డు కార్యదర్శి కార్నలీస్ తెలిపారు.

## మహానందీశ్వరుని మాన్యం కబ్జా

- పట్టాదారు పాసు పుస్తకాలతో పంట రుణాలు పొందిన వైనం
- స్వాధీనం చేసుకుంటామంటున్న ఆలయ ఈవో



తమ్మడపల్లి పొలాల్లో కబ్జాకు గురైన మహానందీశ్వరుని భూమి

మహానంది, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆలయ భూములను పరిరక్షించాల్సిన అధికారే కాజేసేందుకు పన్నాగం వేశాడు. రూ.కోట్ల విలువ చేసే భూములను ఇతరులకు కట్టబెట్టిందుకు సహాయ సహకారాలు అందించాడు. రెండు సంవత్సరాల క్రితం స్వామి వారి ఆలయ భూములను కొందరు తమవే అంటూ రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు చేయించుకున్నారు. దేవస్థానం ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి చొరవతో ఈ వ్యవహారం బయట పడింది. నంద్యాల జిల్లాలో పేరు ప్రఖ్యాతలు గాంచిన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు దాదాపు వంద సంవత్సరాల క్రితం స్వామి వారికి దాతలు భూములు ఇచ్చారు. మహానంది మండల పరిధిలోని తమ్మడపల్లి గ్రామ పొలిమేరలో సర్వే నెంబర్ 314లో ఎకరా 14 సెంట్లు, సర్వే నెంబర్ 303లో 8 ఎకరాల 74 సెంట్ల భూమి ఉంది. ఈ భూమిని అదే గ్రామానికి చెందిన కొందరు కబ్జా చేశారు. తమకు వంశపార్యపరంగా వస్తున్నట్లు రెవెన్యూ రికార్డులో పేర్లను నమోదు చేయించుకొని ఏకంగా పట్టాదారు పాసుపుస్తకాలను పొందారు. ఇందుకు గతంలో పని చేసిన మహానంది దేవస్థానం ఆలయ ఈవోతో పాటు పాలకమండలి చైర్మన్ సహకారం ఉన్నట్లు తెలుస్తోంది. అంతేగాకుండా ఓ ప్రజాప్రతినిధి ఆదేశాలతో రెవెన్యూ అధికారులు కూడా ఎలాంటి విచారణ చేపట్టకుండా గుడ్డిగా పాసుపుస్తకాలు జారీ చేసినట్లు సమాచారం. దీంతో మహానందీశ్వరుని మాన్యం భూములతో పట్టదారు పాసుపుస్తకాలు పుట్టించుకున్న వ్యక్తులకు బ్యాంకు రుణాలు సైతం మంజూరైనట్లు తెలుస్తోంది. సామాన్య రైతులు పాసుపుస్తకాల కోసం కార్యాలయం వెళితే చెప్పులు అరిగేలా తిప్పుకునే రెవెన్యూ అధికారులు మహానందీశ్వరుని భూములను ఇతరులకు కట్టబెట్టడంపై చర్చనీయాంశంగా మారింది.

### మాన్యం భూములను స్వాధీనం చేసుకుంటాం

మహానందీశ్వర స్వామికి చెందిన మాన్యం భూములను ఎవరైనా ఆక్రమిస్తే ఊరుకునేది లేదు. మహానంది ఆలయానికి చెందిన రెండు సర్వే నెంబర్లలో ఉన్నటు వంటి భూములను కొందరు అనుభవిస్తూ వాటికి ఏకంగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందినట్లు మా దృష్టికి వచ్చింది. దీంతో సర్వే చేయించి భూమిని గుర్తించాంది. త్వరలో స్వాధీనం చేసుకొని మహానంది భూములుగా రికార్డుల్లో నమోదు చేయిస్తాం.

-ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి



తమ్మడపల్లిలో కబ్జాకు గురైన మాన్యం భూముల్లో సర్వే చేస్తున్న రెవెన్యూ, దేవస్థానం అధికారులు

## వానరానికి పోలీసుల అంత్యక్రియలు

కర్నూలు క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మృతి చెందిన వానరానికి కర్నూలు వన్‌టౌన్ పోలీసులు అంత్యక్రియలు చేశారు. పాత నగరంలో ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలో కరెంటు తీగలు తగిలి వానరం మృతి చెందింది. అందరూ చూస్తూ అయ్యో పాపం అంటున్నారే గానీ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితుల్లో ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ కానిస్టేబుళ్ల తాయన్న, ప్రకాష్ రెడ్డి, రఘులు కలిసి ఆ వానరాన్ని శ్మశాన వాటికకు తరలించి హిందూ సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు.



వానరానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

## 8న జంతు సంక్షేమ బోర్డు బృందం రాక

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరానికి జనవరి 8వ తేదీన భారత జంతు సంక్షేమ బోర్డు (యానిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా) బృందం రానున్నట్లు నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. సోమవారం గార్గేయపురం డంపు యార్డులోని కుక్కల సంతాన నియంత్రణ ఆపరేషన్ కేంద్రాన్ని కమిషనర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో కుక్కల బెడద నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అందులో భాగంగా కొద్ది నెలల క్రితం నిలిచిపోయిన శునకాల ఆపరేషన్లను పునఃప్రారంభించేందుకు అనుమతి కోసం నగర పాలక, భారత జంతు సంక్షేమ బోర్డుకు దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు. జనవరి 8న భారత జంతు సంక్షేమ బోర్డు బృందం నగరానికి వచ్చి గార్గేయపురం డంపు యార్డులో ఉన్న కుక్కల సంతాన నియంత్రణ కేంద్రాన్ని పరిశీలిస్తుందని కమిషనర్ తెలిపారు. అనుమతులు మంజూరైతే ప్రతి రోజూ 20 శునకాలను ఆపరేషన్ల ప్రక్రియ పునఃప్రారంభిస్తామన్నారు. మరో 15 శునకాల ఆపరేషన్లకు సంబంధించిన భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని, త్వరలో పనులుపూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారి డా.కే.విశ్వేశ్వరరెడ్డి, డీఈఈ గంగాధర్, వెటర్నరీ డాక్టర్ మల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

## దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం

- మొదటి రోజు 190 మంది ఎంపిక
- అమావాస్య కావడంతో పలువురు గైర్హాజర్



100 మీటర్ల పరుగుపందెం

కర్నూలు క్రైం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల నియామక దేహ దారుఢ్య పరీక్షలు సోమవారం మొదటి రోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఏపీఎస్‌పీ రెండో బెటాలియన్‌లో నిర్వహించే ఈ పరీక్షలకు ఎస్పీ జి. బిందుమాధవ్ హాజరై పరీక్షలను ప్రారంభించారు. ఈ పరీక్షకు 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 280 మంది అభ్యర్థులు బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఛాతీ వంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం వీరికి ఫిజకల్ ఎఫిషియన్సీ టెస్టులు, 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ పరీక్షలు నిర్వహించారు. 1600 మీటర్ల పరుగు పరీక్షలో 240 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. 208 మంది అర్హత సాదించారు. 100 మీటర్ల పరుగులో 208 అభ్యర్థులు పాల్గొనగా 134 మంది అర్హత సాధించారు. లాంగ్‌జంప్‌లో 208 మంది అభ్యర్థులు పాల్గొనగా 187 మంది అర్హత సాధించారు. కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షకు మొదటి రోజు 190 మంది అర్హత సాధించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో 10,143 మంది అభ్యర్థులు ఉన్నారన్నారు. ప్రతి రోజు 600 మంది అభ్యర్థులకు దేహ దారుఢ్య పరీక్షల్లో పాల్గొంటారన్నారు. ఏదేనా సమస్యపై అప్పీలు చేసుకునే వారు రిక్విజిషన్ రాసి ఇచ్చి జనవరి 28న అప్పీలుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. హుశేన్‌పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అమావాస్య కావడంతో.. ఈ పరీక్షలకు సుమారు 300 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు తెలుస్తున్నది.



పరిశీలిస్తున్న ఎస్పీ, ఏఎస్పీ, డీఎస్పీ



అభ్యర్థులకు జియో ట్యాగ్ అమర్చుతున్న పోలీసులు

## నేడు కర్నూలులో 30 పోలీసు యాక్టు

### నూతన సంవత్సర వేడుకల్లో అల్లర్లకు పాల్పడితే చర్యలు : డీఎస్పీ బాబు ప్రసాద్

కర్నూలు క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం పోలీసు 30 యాక్టు అమలులో ఉంటుంది. జిల్లాలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని డీఎస్పీ బాబు ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మంగళవారం రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో పోలీసుల నియమ నిబంధనలు పాటించాలన్నారు. 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందని తెలిపారు. అనంతరం పలు ఆంక్షలు, సూచనలు చేశారు.

#### నూతన వేడుకల్లో పోలీసుల ఆంక్షలు

- కర్నూలు సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుంది.
- మద్యం తాగి వాహనాలు నడిపితే.. మోటారు వాహనాల చట్టం 185 ప్రకారం, నేరం, ఇందుకు రూ.10 వేలు జరిమానా, లేక 6 నెలల జైలు శిక్ష ఉంటుంది.
- డ్రైవింగ్ లైసెన్సు 3 నెలలు లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు లేదా శాశ్వతంగా సస్పెండ్ చేస్తారు.
- మద్యం షాపులు ప్రభుత్వం అనుమతించిన సమయం వరకే తెరిచి ఉంచాలి.
- మైనర్లు వాహనాన్ని నడపరాదు. వాహన యజమానులపై చట్టపరమైన చర్యలు ఉంటాయి.
- ద్విచక్రవాహనాల సైలెన్సర్లు తీసివేయరాదు. సైలెన్సర్లు తీసి వాహనాలను నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయి.
- వాహనాలను అధిక వేగంతో, ప్రమాదకర డ్రైవింగ్, ప్రజా ప్రదేశాల్లో రేసింగ్ చేయడం మోటారు వాహనాల చట్టం సెక్షన్ 183, 184 ప్రకారం శిక్షార్హులు
- వేడుకల పేరుతో మహిళల పట్ల, ఇతర వాహనదారులపట్ల అసభ్యకరంగా, అమర్యాదగా ప్రవర్తించకూడదు.
- శుభాకాంక్షలు చెప్పాలనే నెపంతో ఈవ్ టీజింగ్, స్నాచింగ్ చేసే అవకాశాలు ఉంటాయని, జాగ్రత్తగా ఉండాలన్నారు. అనుమానితులు ఉంటే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలి



- ఎవరైనా నూతన సంవత్సర వేడుకలు, కార్యక్రమాలు నిర్వహించదలిస్తే ముందుగా కర్నూలు ఎస్‌డీపీవో అనుమతి తీసుకోవాలి. అటువంటి వారికి రాత్రి ఒంటి గంట వరకు షరతుల మేరకు అనుమతి ఉంటుంది.
- రోడ్లపైన ట్రాఫిక్ జామ్ చేసి, కేకులు కట్ చేయకూడదు. అలా చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయి. డీజేలకు పర్మిషన్లు లేవు
- రోడ్లపైన బారికేడ్లు, డివైడర్స్‌గానీ, రోడ్లకు ఇరువైపులా ఉన్న మొక్కలను డ్యామేజీ చేస్తే వారిపై చట్టపరమైన శిక్షలు ఉంటాయి.
- రోడ్లపైన, జంక్షన్లలో ఎలాంటి టపాసులు పేల్చరాదు.

## పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

- పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి
- సీపీఎం జిల్లా మహాసభలో పలు తీర్మానాలు
- ముగిసిన 23వ సభలు



సభలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన పార్టీ ప్రతినిధులు

ఎమ్మిగనూరు , డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో జరుగుతున్న సీపీఎం కర్నూలు జిల్లా 23వ మహాసభలు సోమవారం స్థానిక సోమప్ప మెమోరియల్ హాల్‌లో రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా పార్టీ జెండాను జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు ఎగురవేశారు. అమరవీరుల స్థూపం దగ్గర నివాళులు అర్పించారు. అనంతరం జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయటంతో పాటు పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని మహాసభ తీర్మానించింది. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, వలసలు నివారించాలని, మహిళలపై దాడులు అరికట్టాలని, అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించి వారికి భద్రత కల్పించాలని మహాసభ తీర్మానించింది. అలాగే జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి చేయటం, ఐటీ, ఫార్మా, కంపెనీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. దళితక్రైస్తవులను ఎస్సీలుగా కొనసాగించాలని, వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షించాలని, ముస్లిం మైనార్టీల సమస్యలను పరిష్కరించాలని తీర్మానించింది. మహాసభ అధ్యక్షవర్గంగా పీ. నిర్మల, టీ రాముడు, లక్ష్మన్న వ్యవహరించారు. సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్, రాష్ట్ర నాయకులు ప్రభాకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, రామన్న, జిల్లా నాయకులు రాధాకృష్ణ, గోవిందు, హనుమంతు, రాముడు పాల్గొన్నారు.



సీపీఎం జెండాను ఎగురవేస్తున్న జిల్లా నాయకులు రామాంజనేయలు

**సీపీఎం జిల్లా కార్యదర్శిగా గౌస్ దేశాయ్ ఎన్నిక:** మహాసభ 26మందితో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నది. జిల్లా కార్యదర్శిగా రెండోసారి డీ గౌస్ దేశాయ్‌ని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా పీ నిర్మల, జి రామకృష్ణ, కే వెంకటేశ్వర్లు, కేవీ నారాయణ, ఎండీ అంజిబాబు, ఎండీ ఆనంద్ బాబు, టీ రాముడును ఎన్నుకున్నారు.

## వేడుకలకు కాంగ్రెస్ పార్టీ దూరం

**నంద్యాల రూరల్/కర్నూలు అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** జనవరి 1న జరిగే న్యూ ఇయర్ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ దూరంగా ఉంటుందని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జంగిటి లక్ష్మీనరసింహయాదవ్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ తెలిపారు. భారత మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ మరణం నేపథ్యంలో ఏపీసీసీ ఈ నిర్ణయం తీసుకుందన్నారు. అన్ని నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో నాయకులు జనవరి మూడో తేదీ వరకు మన్మోహన్ సింగ్ సంతాప సభ కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సంతాప సభకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

## ట్రాక్టర్ బోల్తా.. వ్యవసాయ కూలీ మృతి

**గడివేముల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** ట్రాక్టర్ బోల్తా పడి వ్యవసాయ కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని కరిమద్దెల గ్రామ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని నార్త్ 24 పర్గానాస్ జిల్లాలోని దుచ్చికల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు వరి నాట్ల కోసం బండిఆత్మకూరు మండలంలోని రామాపురం వచ్చారు. పార్నపల్లి గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రెడ్డి పొలంలో వరి నాట్లు వేసేందుకు ట్రాక్టర్‌పై వెళ్తుండగా కరిమద్దెల గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో వ్యవసాయ కూలీ సునీల్ సర్దార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

## గుర్తు తెలియని శవం లభ్యం

**దొర్నిపాడు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని గుండుపాపల గ్రామంలో గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. గుండుపాపల గ్రామంలోని బస్‌స్టాప్ వద్ద మురుగు కాలువలో శవం కనిపించడంతో స్థానికులు సమాచారం అందించారని అన్నారు. మృతి చెందిన వ్యక్తి రెండు రోజులుగా ఒంటెలగల, గుండుపాపల గ్రామాల్లో తిరుగుతుండేవాడని స్థానికులు తెలిపారు. మృతికి గల కారణాలను పోలీసు విచారణలో తెలుస్తుందని అన్నారు. మృతుడి ఆచూకీ కోసం 9121101178, 9121101166 నంబర్‌లకు సంప్రదించాలని అన్నారు.

## వ్యక్తిపై దాడి... కేసు నమోదు

**ఉయ్యాలవాడ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):** మండలంలోని అల్లూరు గ్రామానికి చెందిన బుడ్డా విష్ణువర్ధన్‌పై అదే గ్రామానికి చెందిన తరిగోపుల జశ్వంత్‌రెడ్డి, చరణ్‌రెడ్డి, తులసిరెడ్డిలు దాడి చేసి గాయపరిచినట్లు హెడ్‌కానిస్టేబుల్ నూర్‌అహ్మద్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాత కక్షలు మనస్సులో పెట్టుకొని గడ్డి మోపు దించుతున్న తనపై ముగ్గురు ప్లాస్టిక్ పైపుతో కొట్టి గాయపరిచినట్లు విష్ణువర్ధన్ ఫిర్యాదు చేశాడన్నారు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

## 39 కేజీల గంజాయి ధ్వంసం

**నంద్యాల క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులకు పట్టుబడిన 39.549 కేజీల గంజాయిని సోమవారం ధ్వంసం చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. జిల్లాలోని డోన్ పట్టణం, ఆళ్లగడ్డ రూరల్, చాగలమర్రి, బండిఆత్మకూరు, కొత్తపల్లి, నంద్యాల త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 17 ఎన్‌డీపీఎస్ కేసుల్లో సీజ్ చేసిన మొత్తం 39.549 కేజీల గంజాయి విలువ రూ.4.74 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. పట్టుబడిన గంజాయి మొత్తాన్ని నంద్యాల నుంచి అయ్యలూరు రోడ్డుకు పోయే దారిలో విజయపాల డెయిరీ ఎదురుగా జన సంచారంలేని ఖాళీ స్థలంలో అడిషనల్ ఎస్పీ ఎన్. యుగంధర్‌బాబు ఆధ్వర్యంలో మెంబర్ ఆఫ్ డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ సమక్షంలో ధ్వంసం చేసినట్లు పోలీస్ అధికారులు పేర్కొన్నారు.

## కనకాద్రిపల్లెలో సైబర్ మోసం

• నిమిషాల్లోనే రూ.25 వేలు మాయం

**కొలిమిగుండ్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని కనకాద్రిపల్లెలో సోమవారం సైబర్ మోసం జరిగింది. బాధితుడి కథనం మేరకు.. గ్రామానికి చెందిన యశ్వంత్ అనే వ్యక్తికి ఓ గుర్తు తెలియని నంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తాము ఎస్‌బీఐ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. మీరు వాడుతున్న ఎస్‌బీఐ యోనో యాప్ పని చేయడం లేదని, దాన్ని సరి చేయడానికి తాము పంపించే లింక్ ఓపెన్ చేయాలని సూచించారు. దీంతో యశ్వంత్ లింక్‌ను ఓపెన్ చేసి తన సెల్ ఫోన్‌కు వచ్చిన పిన్ నంబరు వారికి తెలిపాడు. కాసేపటికే తన అకౌంట్ చెక్ చేసుకున్న యశ్వంత్ రూ.25వేలు మాయమైనట్లు గుర్తించాడు. పోలీసులను సంప్రదించగా సైబర్ క్రైమ్ కావడంతో నంద్యాల ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించనట్లు తెలిపాడు.

## 8 నుంచి లా సెమిస్టర్ పరీక్షలు

**కర్నూలు అర్బన్, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి):** రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో లా 3, 5 సంవత్సరాలకు సంబంధించిన 2,4,6,8,10 సెమిస్టర్ల రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. పరీక్షల టైం టేబుల్ ప్రకారం జనవరి 8న నుంచి 31 వరకు జరుగుతాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఆయా కళాశాలల ప్రధానోపాధ్యాయులకు పంపించామని తెలిపారు.

# మెరుగైన వైద్య సేవలకు యాక్షన్ ప్లాన్

• కర్నూలు జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ కె.సింధు సుబ్రహ్మణ్యం

**కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** రోగులకు మెరుగైన సేవలు అందించడానికి 24 గంటలు అందుబాటులో ఉంటానని కొత్తగా కర్నూలు జీజీహెచ్‌కు నియమితులైన డిప్యూటీ కలెక్టర్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ కె.సింధు సుబ్రహ్మణ్యం అన్నారు. హాస్పిటల్‌కు వచ్చిన ప్రతి రోగికి వైద్యం అందేలా కృషి చేస్తానన్నారు. కొత్తగా విధుల్లో చేరిన హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ కె.సింధు సుబ్రహ్మణ్యంతో ఇంటర్వ్యూ వివరాలు..



**కుటుంబ నేపథ్యం..**

తండ్రి సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం, తల్లి మార్గరెట్ జగనాటి. వీరి కూతురు పి.సింధూ సుబ్రహ్మణ్యం. అన్న మణిసుందరం హైదరాబాదులో బిజినెస్ వ్యవహారాలు చూస్తుంటారు. సొంత జిల్లా నెల్లూరు, పుట్టింది కడప. పెరిగింది హైదరాబాదు.

**విద్యాభ్యాసం..**

1వ తరగతి వరకు బంగ్లాదేశ్ రాజధాని ఢాకా. 4వ తరగతి నేపాల్‌లోని ఖాట్మండు, 5వ తరగతి హైదరాబాదు, 6 నుంచి 7వ తరగతి మదనపల్లె, 8, 9, 10 తరగతులు హైదరాబాదు చిన్మయ స్కూల్ బేగంపేట, ఇంటర్, డిగ్రీ హైదరాబాదు సెయింట్ మేరీస్ యూసుఫ్‌గూడా.

**డిప్యూటీ కలెక్టర్‌గా పోస్టింగ్**

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి దగ్గర ముఖ్య కార్యదర్శిగా పని చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి డా.పి. సుబ్రహ్మణ్యం. చిత్తూరు జిల్లాలో జరగాల్సిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొనేందుకు వైఎస్ రాజశేఖర్ రెడ్డితో కలిసి వెళ్లి 2009 సెప్టెంబరు 2న హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. ఈ నేపథ్యంలో కుమార్తె పి.సింధు సుబ్రహ్మణ్యంకు 2019 జూలై 5న డిప్యూటీ కలెక్టర్‌గా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. మొదటి పోస్టు ఎన్టీఆర్ కృష్ణా జిల్లాకు వేసింది. కోవిడ్ సమయంలో కాంట్రాక్టు ట్రేసింగ్‌లో పని చేసి ప్రశంసలు పొందారు. అనంతరం కోనసీమ జిల్లా అమలాపురం ఆర్‌డీవోగా పని చేశారు. వెయిటింగ్ స్టులో ఉన్న ఆమెను ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్‌గా నియమించింది.

### వేగంగా ఫిర్యాదుల పరిష్కారం

హాస్పిటల్‌లో శానిటేషన్, సెక్యూరిటీ పెస్ట్, పార్కింగ్ అత్యవసర వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వనున్నామన్నారు. ఇరవై నాలుగు గంటలు వైద్యం అందించేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఎవరైనా నేరుగా వచ్చి ఫిర్యాదు చేస్తే సమస్యను పరిష్కరిస్తామన్నారు. మెడికల్ సర్జరీ, క్యాన్సర్ న్యూడయోగ్నస్టిక్ బ్లాకులను రెగ్యులర్‌గా తనిఖీ చేసి వాటికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. మినిస్టీరియల్ సిబ్బందికి వారు చూసే సెక్షన్‌కు సంబంధించిన ప్రతి ఫైల్‌పై అవగాహన ఉండాలన్నారు.

## సచివాలయ ఉద్యోగులకు బయోమెట్రిక్

• జడ్పీ సీఈవో జి. నాసరరెడ్డి

**కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి జిల్లాలోని సచివాలయ ఉద్యోగులందరూ తప్పకుండా బయోమెట్రిక్ వేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ సీఈవో జి.నాసరరెడ్డి అన్నారు. సోమవారం మిస్సింగ్ సిటిజెన్స్, ఎంఎస్‌ఎంఈ తదితర వాటిపై ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీవోలు, డీఎల్‌డీవోలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ జనవరి నుంచి సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ ద్వారా హాజరు వేయకపోతే ఫిబ్రవరి నుంచి జీతాలు చెల్లించడం కుదరదని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సచివాలయ ఉద్యోగులంతా తప్పకుండా బయోమెట్రిక్ హాజరు వేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు 2,67,839 మంది సిటిజెన్స్ ఏ సచివాలయంలో కూడా నమోదు కాలేదన్నారు. అయితే వీరంతా ల్యాండ్ రికార్డ్స్ రైస్ కార్డు, ఆరోగ్యశ్రీలో వారి పేర్లు ఉండటంతోపాటు వివిధ రకాల ప్రభుత్వ ప్రయోజనాలు పొందుతున్నారని తెలిపారు. తక్షణమే వీరందరినీ సచివాల యాల్లో నమోదు చేయించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ప్రైమరీ అగ్రికల్చర్‌కు సంబంధించి 73,462 మంది రైతులు వివిధ రకాల రుణాలు పొందుతున్నారని, వీరందరికి ఈకేవైసీ చేయించాలని అన్నారు. ఇప్పటి వరకు కేవలం 17 శాతం మాత్రమే ఈకేవైసీ చేయించారని వంద శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 80,131 మంది చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారు ఉన్నారని, వారందరినీ ఎంఎస్ఎంఈ కింద చర్పిస్తే ప్రభుత్వ నుంచి వివిధ రకాల ప్రయోజనాలు పొందుతారని అన్నారు. ఇప్పటి వరకు 8636 మందిని మాత్రమే చేర్పించరాని, మిగిలిన వారిని కూడా పూర్తి చేయాలని అన్నారు.



## గడివేములలో చోరీ

• 8 తులాల బంగారు, రూ.13 వేల నగదు అపహరణ

**గడివేముల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** పట్టపగలు తాళం వేసి ఉన్న ఇంటిలో దొంగతనం జరిగిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు పెద్దన్న ఇచ్చిన సమాచారం మేరకు.. పెద్దన్న కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లగా పెద్దన్న పనుల నిమిత్తం వెలుగోడు మండలానికి వెళ్లాడు. తాళం వేసి ఉన్న ఇంటిని గుర్తించిన దుండగులు చాకచక్యంగా తాళం తీసి బీరువాలోని 8 తులాల బంగారు, రూ.13 వేలు అపహరించారని అన్నారు. బాధితుడు దొంగతనం ఘటనపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

## ఆదోనిలో పొద్దుటూరు వాసి మృతి

**ఆదోని, డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి):** ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ఇమామ్ (30) ఆదోనిలో మృతి చెంచాడు. వివరాల మేరకు.. మరో వ్యక్తి కూడా ఆదోనికి వచ్చి కోర్టు సమీపంలోని ఓ హోటల్లో భోజనం చేసి, ఖాళీ స్థలంలో కూర్చున్నారు. ఇంతలోనే ఏమైందో కింద పడిపోయాడు. మృతుడి వెంట వచ్చిన మరో వ్యక్తి పరారైనట్లు స్థానికులు చెబుతున్నారు. సాయంత్రం 5:30లోగా వస్తానని చెప్పినట్లు మృతుడి సోదరుడు బాషా తెలిపారు. స్థానికుల సమాచారంతో చేరుకున్న టూ టౌన్ ఎస్ఐ రామనాథ్ వివరాలను సేకరించి, మృతదేహాన్ని ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడుకి భార్య రేష్మ, ఇద్దరు కుమార్తెలు సంతానం. కేసు నమోదు చేసుకుని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

**నంద్యాల క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల, గుంటూరు జిల్లాల్లో దొంగతనాలు, గ్యాంగ్‌రేప్‌లకు పాల్పడుతున్న చెంచుదాసరి సుంకన్న అలియాస్ తోల్లోడు అనే వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి నిందితుడి వివరాలు వెల్లడించారు. నిందితుడు చెంచు దాసరి సుంకన్న స్వగ్రామం గడివేముల మండలం కరిమద్దెల అని తెలిపారు. నిందితుడు 2016 నుంచి ఇప్పటివరకు నంద్యాల జిల్లా, గుంటూరు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలు, దోపిడీలు, గ్యాంగ్‌రేప్‌లకు పాల్పడ్డాడన్నారు. ఇతడి కోసం రెండు జిల్లాల పోలీసులు గాలిస్తున్నారని పేర్కొన్నారు. ఎట్టకేలకు నిందితుడిని సోమవారం ఉదయం 11గంటల సమయంలో నంద్యాల ఆటోనగర్ వద్ద అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి 3 తులాల బంగారు నల్లపూసలదండ, 8గ్రాములు బరువు కలిగిన ఒక జత బంగారు కమ్మలు వీటి విలువ రూ.2.50 లక్షలు సీజ్ చేశామన్నారు. నిందితుడు తన అనుచరులతో కలిసి నంద్యాల చుట్టుపక్కల గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడి వచ్చిన సొమ్మును పంచుకునేవారని తెలిపారు. వీరు గతంలో నంద్యాల జిల్లాలోని నంద్యాల తాలుకా, పాణ్యం, మహానంది, పాములపాడు, బండిఆత్మకూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో సుమారు 11దొంగతనాలు, రెండు దోపిడీల్లో పాల్గొన్నారన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసినవారిలో సీసీఎస్ సిబ్బంది హెడ్‌కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, ఇబ్రహీమ్, యేసుదాసు, పోలీస్ కానిస్టేబుళ్లు గంగారం, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, నాగరాజు, మాలిక్‌బాషా, ఇస్మాయిల్ ఉన్నారు. వారిని కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, ఏఎస్పీ ఎన్.యుగంధర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు

## తల్లిదండ్రులే నిజమైన హీరోలు

• విశ్రాంత ఐజీ ఇక్బాల్



విద్యార్థులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న ఇక్బాల్

**పాణ్యం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** నిజ జీవితంలో హీరోలు మన తల్లిదండ్రులేనని విశ్రాంత రాయలసీమ ఐజీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. సోమవారం పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రూ. 25 వేల విలువైన క్రీడాసామాగ్రిని అందజేశారు. విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సినిమా నటులను చూసి హీరోలు అనుకోవద్దని అన్నారు. సినిమాలు జీవితం కాదన్నారు. ఇతరులకు సహాయం చేయడం ద్వారా దేవుని ఆశీస్సులు లభిస్తాయన్నారు. ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఐజీ ఇక్బాల్‌ను హెచ్‌ఎం జిలానిబాషా ఆద్వర్యంలో సన్మానించారు.

## నేడు 15 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

**కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో మంగళవారం 15 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని గోనెగండ్ల మండలంలోని నేరుడుప్పల, నందవరం మండలం పెద్ద కొటిలికి, కౌతాళం మండలం లింగాల దిన్నె, ఆగసల గ్రామం, మంత్రాలయం మండలం నారాయణపురం, ఆదోని మండలం కుప్పగల్లు, బెలేకల్, హొళగుంద మండలం మూగమానుగొంది, కర్నూలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఓర్వకల్లు మండలం కన్నమడకల, కల్లూరు మండలంలోని కె. మార్కాపురం, వెల్దుర్తి మండలం బోగోలు, కర్నూలు రూరల్ పంచలింగాల, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లో పత్తికొండ మండలంలోని పుచ్చకాయలమడ గ్రామం, ఆలూరు మండలంలోని ఎ. గోనేహాల్, ఆస్పరి మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామం మొత్తం 15 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఉంటాయని డీఆర్వో వెంకట నారాయణమ్మ తెలిపారు.

**50 అర్జీలు స్వీకరణ..**

జిల్లాలో సోమవారం ఐదు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా.. 50 అర్జీలు స్వీకరించామని డీఆర్వో తెలిపారు. ఆదోని డివిజన్‌లోని ఆదోని మండలంలో జాలిమంచి గ్రామంలో 5, పాండవగల్లులో 4, కర్నూలు డివిజన్ కర్నూలు అర్బన్‌లో 2, ఓర్వకల్లు మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో 33, కల్లూరు మండలంలోని రేమదూరు గ్రామంలో 6 అర్జీలు వచ్చాయన్నారు.



## ఫిబ్రవరి 28 వరకు లైఫ్ సర్టిఫికెట్ల స్వీకరణ

**కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రప్రభుత్వం సర్వీసు, ఫ్యామిలీ పింఛన్‌దారుల నుంచి లైఫ్ సర్టిఫికెట్లను జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28 వరకు అన్ని సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో స్వీకరించనున్నట్లు జిల్లా ఖజానాధికారి రామచంద్రరావు తెలిపారు. ఆన్‌లైన్ బయోమెట్రిక్ విధానం, జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా కూడా సమర్పించవచ్చునన్నారు. పింఛన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్ అందించేందుకు జనవరి 1వ తేదీ నుంచి అన్ని ట్రెజరీ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు, హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశామన్నారు.

## యాక్షన్ ప్లాన్ రూపొందించండి

• కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా

**కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** యాస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాంలో అవార్డులు పొందిన మద్దికెర, చిప్పగిరి మండలాల అభివృద్ధికి జనవరి 31లోపు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడారు. నీతి అయోగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాంలో మద్దికెర, చిప్పగిరి మండలాలు 2024 జూలై, సెప్టెంబరు త్రైమాసికాలకు సంబంధించి సౌత్ ఇండియాలో మొదటి స్థానంలో దేశంలో 18, 36 స్థానంలో ఉండి అవార్డులు సాధించాయన్నారు. ఈ అవార్డుల ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి చిప్పగిరి మండలానికి రూ.1.5 కోట్లు, మద్దికెర మండ లానికి రూ.కోటి మంజూరు కావడం గొప్ప విషయమన్నారు. అందుకు కృషి చేసిన డీపీవో, జడ్పీ సీఈవో, డీఎంహెచ్‌వో, ఐసీడీఎస్ పీడీ, సీపీవో, చిప్పగిరి, మద్దికెర మండలాల ఎంపీడీవోలు, మండల, జిల్లా స్థాయి అధికారులందరికీ అభినందనలు తెలిపారు. ఇది శుభసూచకమని, ఇదే స్ఫూర్తితో అధికారులందరూ పని చేసి జిల్లాలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని కోరారు. వచ్చిన అవార్డు మొత్తానికి సంబంధించి రెండు మండలాల్లో అత్యంత ప్రాధాన్యం కలిగిన పనులతో యాక్షన్‌ను రూపొందించాలని మద్దికెర, చిప్పగిరి మండలాల ఎంపీడీవోలను ఆదేశించారు. సమావేశంలో జేసీ డా.బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, కొండయ్య, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలకు మైక్ సెట్ అందజేత


వేంపెంట జిల్లా పరిషత్ పాఠశాలకు మైక్‌సెట్ అందజేస్తున్న దృశ్యం

**పాములపాడు డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని వేంపెంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మైక్‌సెట్‌ను ఉచితంగా అందజేశారు. సోమవారం క్రీడా అభిమాని పీతాంబరరెడ్డి రూ. 10వేలు విలువచేసే మైక్‌సెట్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు క్రిష్ణమూర్తికి అందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను అభినందించారు.

## కబడ్డీ క్రీడాకారులకు శిక్షణ ప్రారంభం


క్రీడాకారుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్పీటీసీ

**పగిడ్యాల, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) :** పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాకారుల శిక్షణ కార్యక్రమాన్ని జడ్పీటీసీ పుల్యాల దివ్య సోమవారం ప్రారంభించారు. రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే కబడ్డీ అండర్-20 పోటీలలో పాల్గొనే క్రీడాకరులకు శిక్షణ కార్యక్రమం ఇక్కడ ఏర్పాటు చేయడం సంతోషించదగ్గిన విషయమన్నారు. క్రీడాకారులు మంచి శిక్షణ పొంది, రాష్ట్రస్థాయిలో విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రావు, టీడీపీ నాయకులు దామోదర్‌రెడ్డి, వాసురెడ్డి, సత్యంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బీజేపీని బలోపేతం చేస్తా


నియామక పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

**బండిఆత్మకూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):** మండలంలోని 20 గ్రామాల్లో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేస్తానని మండల అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వెంగళరెడ్డిపేట గ్రామంలో బీజేపీ పోలింగ్ బూత్ కన్వీనర్లు, సీనియర్ నాయకుల సమావేశం నంద్యాల నియోజకవర్గ పార్టీ ఎన్నికల నిర్వాహకులు చంద్రమౌళి, మండల నిర్వాహకుడు మేడా మురళీధర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనకు వారు నియామక పత్రం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో చింతా నాగేశ్వరరావు, ధనుంజయరెడ్డి, శ్యామ్‌సుందర్, శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, తిరుపంరెడ్డి, శివనాగిరెడ్డి పాల్గొన్నారు.

## ప్రజలను పోరాటాలకు సిద్ధం చేయండి

**నంద్యాల రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి);** నంద్యాల పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలపై ప్రజలను సమీకరించి పోరాటాలకు సిద్ధం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న సమస్యలపైన అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రోడ్లు, డ్రైనేజీతో పాటు వేసవిలో పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులను, అధికారులను కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగరాజు, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు నరసింహ పాల్గొన్నారు.

## ఉగాది నాటికి ఆలయ అభివృద్ధి పనులు పూర్తి

**పాణ్యం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులు ఉగాదినాటికి పూర్తవుతాయని ఆలయ జీర్ణోద్ధరణ కమిటీ అధ్యక్షుడు మిలిటరీ సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆలయ మహా ప్రాకార పనులు దాదాపు పూర్తయ్యాయన్నారు. ఆలయ క్యూలైన్ పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు. ఆలయానికి చెందిన స్థలంలో అతిథి గృహం నిర్మాణానికి త్వరలో భూమి పూజను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే గౌరుచరిత తన వంతు కృషి చేస్తామన్నారు. పనులు పూర్తి చేసి భక్తులకు సౌకర్యాలు మెరుగుపరుస్తామని తెలిపారు.

## సావిత్రీబాయి పురస్కారానికి ఎంపిక


షేక్ బేగం

**నంద్యాల రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** నంద్యాలలోని గురురాజ పాఠశాల కో ఆర్డినేటర్ షేక్ బేగం సావిత్రి బాయి పూలే జాతీయ పురస్కారానికి ఎంపికైనట్లు ఆ పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి సోమవారం తెలిపా రు. దక్షిణాది ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అందజేసే ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి తమ పాఠశాల ఉపాధ్యాయురాలు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. జనవరి 5న సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా గుంటూరులో జరిగే సభలో ఆమె జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందుకోనున్నట్లు చెప్పారు.

## గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలి


పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

**వెలుగోడు డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** క్రీడకారులు క్రీడలలో గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని, ఓటమి గెలుపునకు నాంది అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, టీడీపీ నాయకులు అన్నారపు శేషిరెడ్డి, ఖలీల్, జాకీర్, అమీర్‌హంజాలు అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను పురస్కరించుకొని వారు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలలో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాము, కిరణ్, సూఫియాన్, ఉక్కేస్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ మండల అధ్యక్షుడిగా మురళీమోహన్

**పాములపాడు డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** పాములపాడు మండల అధ్యక్షుడిగా రాయపాటి మురళీమోహన్‌గా బీజేపీ ప్రకటించింది. సోమవారం బీజేపీ సీనియర్ నాయకులు మండల రిటర్నింగ్ ఆఫీసర్ మల్లెల క్రిష్ణారెడ్డి, ఏఆర్‌వో చల్లా దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

## మహానందిలో భక్తుల రద్దీ


మహానందిలో పల్లకి సేవ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

**మహానంది, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** మహానంది క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం అమావాస్య పురస్కరించుకొని వేకువజామననే ఆలయం ప్రాంగణంలోని కోనేర్లల్లో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్ల దర్శించుకొని కాయ కర్పూరాలు సమర్పించుకున్నారు.

● మహానంది ఆలయంలో సోమవారం రాత్రి పల్లకి సేవ ఉత్సవాన్ని నిర్వహించారు. ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని ఆధ్వర్యంలో అర్చకులు స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి, పల్లకిలో ఊరేగించారు. కార్యక్రమంలో పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాచమల్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.


కోనేరులో పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు

# చిరు ధాన్యాల సాగును ప్రోత్సహించండి

### -కలెక్టర్ రాజకుమారి


చిరుధాన్యాల స్టాల్స్‌ను తిలకిస్తున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** కొర్రలు, సామలు, ఊదలు, అరికలు, వరిగలు, జొన్నలు, సజ్జ వంటి చిరుధాన్యాలను ప్రోత్సహించాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవార ం కలెక్టరేట్ ప్రాంగణంలో చిరుధాన్యాల ఉత్పత్తులు, సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకు కూరలు స్టాళ్లను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను సేవించి ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. చిరుధాన్యాలు సేంద్రీయ వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులు వినియోగించేలా రైతులు, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో దేశవాళి విత్తనాలతో పండించిన బ్లాక్‌రైస్, రెడ్‌రైస్, చిట్టి ము త్యాలు, కొజ్జా పటాలియా, మైసూర్ మల్లిక తదతర దేశవాళి విత్తనాలను ఆమె పరిశీలిస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. తక్కువ ఖర్చుతో సంపూర్ణ ఆరోగ్యానిచ్చే చిరుధాన్యాలు, సేంద్రియ ఆహార ఉత్పత్తులను గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తీసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

### ఫిర్యాదుదారులకు మధ్యాహ్న భోజనం

ఇండియన్ రెడ్‌క్రాస్‌సొసైటీ, ఓంకారం కాశిరెడ్డి నాయన ఆశ్రమం సంయుక్త ఆధ్వర్యంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదుదారులకు మధ్యాహ్న భోజనం పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్, రెడ్‌క్రాస్‌చైర్మన్ రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ ప్రాంగణంలో ఫిర్యాదుదారులకు మధ్యాహ్నభోజన పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లాలోని సుదూర ప్రాంతాలనుంచి అర్జీదారులు వచ్చి తమ సమస్యలను విన్నవిస్తుంటారని.. ఫిర్యాదుదారులకు ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పీజీఆర్ఎస్ ప్రాంగణంలో షెడ్ వేయుంచడంతో పాటు ప్రశాంతంగా కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగానే మంచినీరుతో పాటు రెడ్‌క్రాస్, కాశిరెడ్డి నాయన ఆశ్రమం సంయుక్త ఆధ్వర్యంలో అర్జీదారులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా పాల్గొని అర్జీదారులకు ఆహార పదార్థాలు వడ్డించడంతో పాటు వారితో కలిసి భోజనం చేస్తూ ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్‌ప్రధాన కార్యదర్శి డిస్ట్రిక్ కోఆపరేటివ్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య, తదితర అధికారులు, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

# ఆరు తీర్మానాలకు ఆమోదం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు

**ఆత్మకూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):** ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నందు సోమవారం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో మొత్తం 7 తీర్మానాలకు గాను 6 తీర్మానాలను సభ్యులు ఆమోదించారు. ఇందులో ప్రధానంగా జనవరి 7,8,9 తేదీల్లో ఆత్మకూరు శివార్లలోని శ్రీశైలం రస్తాలో జరిగే ఇస్తేమాకు సంబంధించి మౌలిక సదుపాయాలు, పారిశుధ్య పనులు, సీసీ కెమెరాల ఏర్పాటుకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రూ.22లక్షల నిధులను వినియోగించుకునేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అదేక్రమంలో ఈ పనులకు సంబంధించి షార్ట్ టెండర్ వర్క్‌లకు కూడా మరో తీర్మానం చేశారు. అదేవిధంగా మున్సిపాలిటీలో పనిచేసే అవుట్ సోర్సింగ్ వర్కర్లకు 2024-25 సంవత్సరానికి సంబంధించి పీఎఫ్ చెల్లించాలనే తీర్మానంతో పాటు ఐలవ్ ఆత్మకూరు ఎల్ఈడీ బోర్డు ఏర్పాటుకు రూ.99వేలు ఖర్చు చేయాలని నిర్ణయించారు. అలాగే కొండా వెంచర్ సమీపంలోని ప్రభుత్వ స్థలం నందు రూ.99వేలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయుటకు, ఆత్మకూరు పట్టణంలోని డీకేటీ పట్టాలు, గ్రామకంఠాలు రిజిస్ట్రేషన్ కాకపోవడం వల్ల ఆయా వాటికి ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం 1శాతం రుసుము వసూళ్ల చేసి క్రయవిక్రయాల తర్వాత ఇంటి పన్ను మార్పునకు తీర్మానించారు. కాగా చెత్త తరలింపు ట్రాక్టర్ల డ్రైవర్ల నియామకానికి సంబంధించి లైట్ మోటారు లైసెన్స్ కలిగిన వారిని నియమించాలని ప్రతిపాదించగా నిబంధనలకు విరుద్ధంగా ఉందన్న కారణంతో ఈ తీర్మానాన్ని సభ్యులు వాయిదా వేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, వైస్ చైర్మన్ రాజగోపాల్, కోఆప్షన్ సభ్యులు ఎం.ఏ.రషీద్, కౌన్సిలర్లు ఉన్నారు.

# హెల్మెట్ వినియోగం శ్రేయస్కరం

### - ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్


హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

**ఆత్మకూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకం వల్ల శ్రేయస్కరమని ఆత్మకూరు డీఎస్పీ రామాంజీనాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం నంద్యాల జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా ఆదేశాల మేరకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణంలో పోలీసు అధికారులు, సిబ్బంది హెల్మెట్ ధరించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీసు స్టేషన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ కేజీరోడ్డు, గౌడ్‌సెంటర్ మీదుగా చక్రంహోటల్ వరకు సాగింది. ఈ సందర్భంగా గౌడ్‌సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడకం వల్ల ఏదైనా ప్రమాదం సంభవిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చునని తెలిపారు. ప్రత్యేకించి యువత అతివేగంగా, ఫోన్లలో మాట్లాడుతూ వెళ్లడం వంటి కారణాలతో ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందని వివరించారు. తల్లిదండ్రులు చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, అలా ఇవ్వడం చట్టరీత్యా నేరమని గుర్తుచేశారు. అదేవిధంగా వాహనదారులు రహదారి నియమాల పట్ల అవగాహన కలిగి రోడ్డు ప్రమాదాల నివారణ కోసం బాధ్యతగా వ్యవహరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆత్మకూరు అర్బన్, రూరల్ సీఐలు రాము, సురేష్‌కుమార్‌రెడ్డి, ఆయా పోలీసుస్టేషన్ల ఎస్సైలు నారాయణరెడ్డి, విష్ణునారాయణ, కేశవ, సురేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

# అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి


పగిడ్యాలలో అంబేద్కరు విగ్రహం వద్ద నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు

**పగిడ్యాల, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) :** అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం పార్టీ మండల కన్వీనరు పక్కీర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. పగిడ్యాలలో అంబేద్కర్ విగ్రహం వద్ద వారు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి హోదాలో ఉండి భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైనది కాదన్నారు. అమిత్‌షా మంత్రి పదవికి రాజీనామా చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉసేనమ్మ, బీరమ్మ, మద్దిలేటి, తిరుపాలు తదిరులు ఉన్నారు.

### దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి

**నందికొట్కూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్ అంబేద్కర్‌ను అవమానించేలా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు సరికాదని తక్షణమే దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలని సీపీఐ,సీపీఎం నాయకులు శ్రీనివాసులు నాగేశ్వరరావులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక నందికొట్కూరు పట్టణంలో అంబేద్కర్ విగ్రహం ముందు వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అమిత్‌షా, రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేద్కర్‌ను అవమానపరచడం బీజేపీకి తగదని, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనని, బీజేపీకి స్వాతంత్ర్య సమరయోధులపై గౌరవం లేదన్నారు. దేశ ప్రజలకు అమిత్‌షా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం ప్రజా సంఘాల నాయకులు గోపాలకృష్ణ, జెస్సరాజు, బాబు, రజితమ్మ, దినేష్, మహానంది, ఉస్మాన్, వెంకటేశ్వర్లు, ఆంజేయులు, నాగన్న, నాయుడు, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను పార్లమెంట్‌లో కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని సీపీఎం నాయకులు ఏసురత్నం, రణధీర్, సుధాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. తక్షణమే ఆయన్ని పార్లమెంట్ నుంచి బర్తరఫ్ చేయాలని అన్నారు. అదేవిధంగా కేంద్ర మంత్రి అమిత్‌షా తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని దేశప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సురేంద్ర, రామ్‌నాయక్, వీరన్న, భాస్కర్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

# వైభవంగా వెండి రథోత్సవం


స్వామి, అమ్మవార్లకు వెండి రథోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు, సిబ్బంది

**శ్రీశైలం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని లోకకళ్యాణార్థం భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు సాయంత్రం వెండి రథోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేసి, అర్చకులు వేదమంత్రోచ్ఛారణలతో పూజలు జరిపారు. అలాగే శ్రీశైల క్షేత్రంలో స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం, ఊయలసేవ ఘనంగా నిర్వహించారు.

## ఉమ్మడి జిల్లా గ్రామీణ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

**కొత్తపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1, 2 తేదీల్లో కొత్తపల్లి మండలం ఎర్రమటం గ్రామంలో దాతల సహకారంతో సీఎస్ఐ సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా గ్రామీణ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు ఎన్.చిన్న నాగేశ్వరరావు, నరసింహులు, చిన్న వెంకటరమణ, సుఖ జీవన్‌బాబు, బాలగోపాల్ రాజు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలను క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఈ నెల 31 సాయంత్రంలోపు ఎంట్రీ ఫీజు రూ.300 చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన మొదటి విజేతకు రూ.10,016, రెండో విజేతకు రూ.7,016, మూడో విజేతకు రూ.5,016 నగదు ప్రోత్సాహన్ని ఇస్తామన్నారు. గ్రామస్థాయిలో మొదటి, రెండో , మూడో విజేతలకు రూ.5,016, రూ.3,016, రూ.2,016 అందజేయనున్నట్లు తెలిపారు.

## డ్రంకెన్ డ్రైవ్‌కు పాల్పడితే చర్యలు

**ఆత్మకూరు, డిసెంబరు 30:** నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని డిసెంబరు 31వ తేది రాత్రి యువత రోడ్లపై డ్రంక్‌అండ్‌డ్రైవ్, త్రిబుల్‌రైడింగ్ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు అర్బన్ సీఐ రాము హెచ్చరించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆత్మకూరు డీఎస్పీ రామాంజీనాయక్ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి పోలీసు బృందాలతో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ముమ్మర దాడులు చేపట్టనున్నట్లు వివరించారు. ప్రత్యేకించి ఆత్మకూరు పట్టణంలోని పలు ప్రధాన కూడళ్ల వద్ద పోలీసులు తనిఖీలు చేయనున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా బైక్ అతివేగంగా నడపడం, బైకుల సైలెన్సర్ల తీసేసి నడపడం, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు వుంటాయని పేర్కొన్నారు. అదేవిధంగా 18ఏళ్లలోపు వాహనాలు నడిపినట్లయితే అలాంటి వారిపై కేసు నమోదు చేస్తామని అన్నారు. అలాగే రోడ్లపై కేకులు కట్ చేసి ఎవరికి ఇబ్బందులకు గురిచేయరాదని పేర్కొన్నారు. మద్యం షాపుల నిర్వాహకులు నిర్దిష్ట సమయంలోగా దుకాణాలను మూసి వేయాలన్నారు.

## ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

**ఆత్మకూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):** ఆత్మకూరులోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో సోమవారం ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దినేష్ ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1970 డిసెంబరు 30న కేరళ రాష్ట్రంలోని తిరువానంతపురంలో ఏర్పాటైన ఎస్ఎఫ్ఐ ఆనాటి నుంచి నేటి వరకు నిరంతరం విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలపై నిత్యం పోరాటాలు నిర్వహిస్తు విద్యాప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సాయి, రామ్ నాయక్, బాలాజీ, దిలీప్‌బాబు, వంశీ, రవి, సాలయ్య ఉన్నారు.

## కేంద్రీయ విద్యాలయాన్ని స్థాపించాలి

**నంద్యాల రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల జిల్లా కేంద్రంలో కేంద్రీయ విద్యాలయాన్ని స్థాపించాలని ఆల్‌మేవ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎస్ఎండి అబులైస్ సోమవారం డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. నంద్యాల ఎన్‌జీవో కాలనీలోని దూరదర్శన్‌కు చెందిన 5ఎకరాల స్థలంలో స్థాపించాలని, ఈ స్థలం చుట్టూ ప్రహరీతో ఉన్న భవనాలు నిరుపయోగంగా ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. నంద్యాలలో కేంద్రీయ విద్యాలయ స్థాపనకు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కేంద్ర విద్యాశాఖకు లేఖ రాశారని గుర్తు చేశారు.

## పీవీ నరసింహారావు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

**నంద్యాల కల్చరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** నంద్యాలలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఏపి బ్రాహ్మణసేవాసమాఖ్య సభ్యులు నంద్యాల ఎంపి డా.బైరెడ్డి శబరిని కలిసి వినతి పత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నగరదోణ సుధీర్, సభ్యులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల నిరసన

**ఆత్మకూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):** ఆత్మకూరు పట్టణంలోని జూనియర్, సీనియర్ కోర్టుల పరిధిలో పనిచేస్తున్న న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బారు అసోసియేషన్ అధ్యక్షులు వేముల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అనంతపురంలో సీనియర్ న్యాయవాది శేషాద్రిని పోలీసుస్టేషన్‌కు పిలిపించి దురుసుగా వ్యవహరించడంతో ఆయన మరణానికి కారణమైన పోలీసు అధికారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పోలీసుశాఖ తరఫున బాధిత న్యాయవాది కుటుంబానికి పోలీసుశాఖ తరుపున రూ.5కోట్ల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనేక సందర్భాల్లో సివిల్ కేసుల్లో పోలీసులు జోక్యం చేసుకోకూడదని సుప్రీం కోర్టు చెబుతున్నా కొంత మంది పోలీసుల తీరు మారడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కంచర్ల గోవిందరెడ్డి, నూర్‌అహ్మద్, గిరిరాజు, కేశవరెడ్డి, ఫజుల్ రహిమాన్, రామకృష్ణ, శంకర్ ఉన్నారు.

## నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**నంద్యాల రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** ఏపీటీఎఫ్ డైరీలో పొందుపరచిన అంశాలు ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని డీఈవో జనార్దన్‌రెడ్డి అన్నారు. ఏపీటీఎఫ్ 2025నూతన క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమం డీఈవో కార్యాలయ ఆవరణలో సోమవారం జరిగింది. డీఈవో జనార్దన్‌రెడ్డి క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. విద్యాశాఖకు సంబంధించిన జీవోలు అన్నింటినీ ఒక పుస్తకరూపంలో ముద్రించడం అవి ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి శివయ్య, భాస్కరరెడ్డి, జాకీర్‌హుసేన్, వీరేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జమిలీ ఎన్నికలు..ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు

● సీపీఐ(ఎం.ఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బంగారు రావు

**నందికొట్కూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** జమిలీ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని సీపీఐ(ఎం.ఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బంగారురావు అన్నారు. రాయలసీమలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీని బలోపేతం చేసేందుకు సోమవారం సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని నందికొట్కూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. సీపీఐ(ఎం.ఎల్) లిబరేషన్ జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి బంగారురావు, రాష్ట్ర కమిటీ నాయకుడు సత్తార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బంగారు రావు మాట్లాడుతూ పార్లమెంట్ నుంచి పంచాయతీ వరకు ఒకే ఎన్నిక, ఒకే దేశం అనే జమిలి ఎన్నికల విధానం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా నేటి ఎన్.డి.యే ప్రభుత్వ పాలన దేశంలో కొనసాగుతున్నదన్నారు. ఈ విధానాన్ని దేశంలోని ప్రతిపక్షపార్టీలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్ అంబేద్కర్‌ను తూలనాడిన అమిత్‌షా రాజీనామా చేయాలని దేశ వ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళనలు జరుగుతున్నాయన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించండి...దేశాన్ని కాపాడండని వామపక్షాలు నవంబరు 26 నుంచి జనవరి 26 వరకు దేశ వ్యాప్తంగా కార్యక్రమాలు చేపడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్తార్, రమణయ్య, నాగరాజు, మునిస్వామి, నాగార్జున, వేమన పాల్గొన్నారు.

## నేడు పెద్దమ్మ జాతర

**రుద్రవరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని నాగులవరం గ్రామంలో మంగళవారం పెద్దమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు సోమవారం తెలిపారు. గ్రామంలో ఆల యాన్ని నూతనంగా నిర్మిం చారు. పెద్దమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించి జాతర నిర్వహి స్తున్నట్లు తెలిపారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

## అల్లర్లకు పాల్పడితే చర్యలు: డీఎస్పీ


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

**డోన్ రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** న్యూ ఇయర్ వేడుకల పేరుతో అర్ధరాత్రి రోడ్లపైకి వచ్చి అల్లర్లకు పాల్పడాలని చూస్తే చర్యలు తప్పవని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ 31న రాత్రి పట్టణ ప్రధాన కూడళ్ల రోడ్లలో బైకుల సైలెన్సర్లను తీసి పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ అల్లర్లు చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. మైనర్లకు బైకులు ఇచ్చిన తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, రూరల్ సీఐ సీఎం రాకేష్, పట్టణ ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి, బేతంచెర్ల, ప్యాపిలి పోలీసులు పాల్గొన్నారు.

## టంగుటూరు వైద్యశాల తనిఖీ

**బనగానపల్లె, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి కాంతారావునాయక్ తనిఖీ చేశారు. డాక్టర్ శివశంకరుడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్వేను అడిగి తెలుసుకున్నారు. కాంతారావు మాట్లాడుతూ 30 ఏళ్ల పైబడ్డ మహిళలకు క్యాన్సర్ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సరస్వతి, ఎంపీహెచ్ఏ అరుణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీజీపీ బ్లాక్ చానల్ పరిశీలన


చిన్నబోదనం గ్రామ సమీపంలో టీజీపీ కాలువలను పరిశీలిస్తున్న ఈఈ, డీఈ

**చాగలమర్రి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలోని 28, 29 టీజీపీ బ్లాక్‌చానల్ పనులు చేసేందుకు సోమవారం కాలువలను టీజీపీ ఈఈ శంకర్‌రెడ్డి, డీఈ గురుమూర్తి పరిశీలించారు. అహోబిలం సమీపంలోని టీజీపీ ప్రధాన కాలువ నుంచి డిస్ట్రిబ్యూటర్లు, చానల్ పనులు చేయడానికి 17 కి.మీ వరకు కాలువను పరిశీలించి అంచనా వేస్తున్నామని అన్నారు. 2వ బ్లాక్ చానళ్లకు రూ.50 లక్షల ప్రకారం నిధులు కేటాయించారని అన్నారు. ఈ నిధులతో కాలువ పనులు వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఏఈ కృష్ణారెడ్డి, లస్కర్లు ఉన్నారు.

## అధికారులు లేక వెలవెబోయిన వీసీ


అధికారులు లేక వెలవెలబోతున్న స్పందన వీసీ

**కొలిమిగుండ్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) :** ప్రతి సోమ వారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంపై కిందిస్థాయి అధికారులు మాత్రం నిర్లక్ష్యాన్ని వీడటంలేదు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా పరిష్కార వేదిక వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో 12గంటల సమయంలో కూడా ఎంపీడీవో, డిప్యూటీ తహసీల్దార్ మరో ఇద్దరు అధికారులు తప్ప కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. చాలా శాఖల అధికారులు కార్యక్ర మానికి గైర్హాజరయ్యారు. వారానికి ఒక్క రోజు ప్రజల కోసం నిర్వహించే కార్యక్రమం పట్ల కూడా కొన్ని శాఖల అధికారులు తమ నిర్లక్ష్యం వీడటంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## రోడ్డు మధ్య నీటి ఊట


వంతెన వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న ఊట నీరు

**అవుకు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) :** అవుకు రిజర్వాయర్ మలుపులో నిర్మించిన వంతెన వద్ద రోడ్డు మధ్య నుంచి నీటి ఊట ఉబికి వస్తోంది. రిజర్వాయర్ నుంచి 12వ బ్లాక్ ద్వారా ఆయకట్టుకు నీటిని తరలించేందుకు ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ ని ర్మించారు. ఎస్సార్బీసీ కాల్వ పైభాగం నుంచి తాడిపత్రికి వెళ్లే ఎన్ హెచ్ రహదారి నిర్మాణం కోసం ఓ వంతెనను నిర్మించారు. ఈ ప్రాంతంలో తాగునీటి పైప్‌లైన్ లేదు. సిమెంట్ రోడ్డుకు తారు రోడ్డుకు మధ్యన నీటి ఊట ఉబికి వస్తూ నీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. రోడ్డుపై నీరు పారుతుండటంతో పాచి ఏర్పడుతుంది. ఈ ప్రాంతంలో టూవీలర్ వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## బ్లాక్‌లో స్టాంపులు


ప్యాపిలిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం

**ప్యాపిలి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):** ప్యాపిలిలో స్టాంపులు బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. ఒక్కో స్టాంపుపై అవసరాన్ని బట్టి రూ.50 నుంచి రూ.100 వరకు వసూళ్లు చేస్తూ స్టాంపు వెండర్లు దోపిడి చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. వెండర్ల అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోతోందన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. సోమవారం రిజిస్ట్రేషన్ల కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ప్యాపిలి, డోన్ మండలాల నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అయితే స్టాంపుల కొరత కారణంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో ఆగ్రహానికి గురైన రైతులు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఆందోళన చేశారు. డాక్యుమెంటు రైటర్లే స్టాంపు వెండర్ల ఏజెన్సీ తీసుకోని దోపిడికి పాల్పడుతున్నారని గుడిపాడుకు చెందని రైతు వెంకటరెడ్డి ఆరోపిస్తున్నారు. డాక్యుమెంటు రైటర్లను అడ్డుపెట్టుకొని కార్యాలయంలో వసూళ్ల దందా సాగుతుందని వారు ఆరోపిస్తున్నారు.

# ఉత్తుత్తి సంపద కేంద్రాలు

- నిరుపయోగంగా మారిన వైనం
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం


నందవరంలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం

**బనగానపల్లె, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో పలు చోట్ల ఎంతో సదుద్దేశంతో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు ఉత్తుత్తి సంపద కేంద్రాలుగా మారాయి. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లా ల్లో కోట్ల రూపాయలు ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద పలు చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటు చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో వీటిని నిర్మించారు. అయితే చాలా చోట్ల కొన్ని నిర్మాణంలో ఉండగా కొన్ని పూర్తి చేసినా అవి ఉపయోగించకపోవంతో నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రభుత్వ ధనం వృథా అయింది. అనుకున్న లక్ష్యం నెరవేరకపోగా కొన్ని కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం చాలా చోట్ల కేంద్రాలు ఉత్స వ విగ్రహాలుగా మారిపోయాయి.

**కేంద్రాల నిర్మాణం ఉద్దేశం :**

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలను ఆర్థిక పరి పుష్టిని నింపాలనే ఉద్దేశంతో చెత్త సంపద కేంద్రాలను నిర్మించింది. ఆయా గ్రామాల్లో ఉన్న చెత్తను పొడి, తడి చెత్తను వేరు చేసి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న గ్రామ పారిశుధ్య కార్మికులతో సేంద్రియ ఎరువులను తయారు చేసి ఆ తయారైన ఎరువులను రైతులకు విక్రయించి గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఉద్దేశం మంచిదే అయినా ఆచరణలో పలుచోట్ల అవి పనిచేయకపోవడంతో చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి.

**ఉమ్మడి జిల్లాలో 637 చెత్త సంపద కేంద్రాలు పూర్తి**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 713 చెత్త సంపద కేంద్రాలు గత ప్రభుత్వంలో ప్రతిపాదనలు పంపగా టీడీపీ ప్రభుత్వహయాంలో 713 కేంద్రాలకు నిధులు మంజూరు అయ్యాయి. రూ. 23.97 కోట్ల నిధులు ఖర్చు చేసి నిర్మాణాలు పూర్తిగావించారు. అయితే ఇందులో 59 కేంద్రాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. బనగానపల్లె మండలంలో మొత్తం 12 చెత్త సంపద కేంద్రాలు పూర్తి అయ్యాయి. చెర్వుపల్లె, యాగంటిపల్లె రెండు గ్రామాల్లో నిర్మాణాలు ఆగిపోయాయి. పాతపాడుతో పాటు మరో రెండు గ్రామాల్లో మాత్రమే పనిచేస్తున్నాయి. మిగతా 7 చోట్ల నిరుపయోగంగా మారిపోయాయి.

**అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా కేంద్రాలు**

ఉమ్మడి జిల్లాల్లో కేవలం 40 శాతం చెత్త సంపదకేంద్రాల్లో మాత్రమే సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నారు. దీంతో చెత్త సంపద కేంద్రాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిపోయాయి. అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. కేవలం ఉత్సవ విగ్రహాలుగా మారిపోయాయి.

**గ్రామ పంచాయతీలకే అప్పగించాం**

చెత్త సంపద కేంద్రాలు తాము ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద నిర్మించి గ్రామపంచాయతీలకు అప్పగించాం. నిర్వహణ బాధ్యత గ్రామపంచాయతీలదే. గ్రామపంచాయతీలు చెత్త సంపద కేంద్రాలను సద్వినియోగం చేసుకొని ఆదాయాన్ని, సంపదను పెంచుకోవాల్సిన బాధ్యత వారిదే. కొన్ని చెత్త సంపద కేంద్రాలు నిర్మించడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో చాలా వరకు కేంద్రాలు ఆగిపోయాయి.

- నరసింహారెడ్డి ఏపీడీ, డోన్

# హోంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



డోన్ పట్టణంలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

**రుద్రవరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) :** కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను క్యాబినెట్ నుంచి వెంటనే తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు రామచంద్రుడు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు మతోన్మాద చర్యల వల్ల ప్రజా సమస్యలు పరిష్కారం కాకపోగా ఘర్షణలు తీవ్రమవుతున్నాయని అన్నారు. భారత రాజ్యాంగం మీద ప్రమాణం చేసి మంత్రి అయిన అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత గురించి చులకనగా మాట్లాడడాన్ని ప్రధాని మోడీ బాధ్యత వహించాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కృష్ణా, గోదావరి జిల్లాల్లో ఎఫ్‌సీఐ ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నారే కానీ నంద్యాల జిల్లాలో కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో శంకర్, సుదర్శన్ పాల్గొన్నారు.

**డోన్ రూరల్:** పార్లమెంటులో ఇటీవల కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సీపీఎం నాయకులు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు చిన్న రెహిమాన్, శివరాం, రామాంజనేయులు, కొండయ్య, మద్దయ్య, నక్కి హరి, తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్లు తప్పనిసరి

- న్యాయాధికారి తంగమణి
- పట్టణంలో బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న న్యాయాధికారి తంగమణి

**డోన్ రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలని డోన్ సబ్ కోర్టు న్యాయాధికారి తంగమణి అన్నారు. సోమవారం సాయంత్రం హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తూ డోన్ పోలీసులు పట్టణ ప్రధాన కూడళ్ల ప్రాంతాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని న్యాయాధికారి తంగమణి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనదారుడు హెల్మెట్లు ధరించాలని, అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయం తప్పుతుందని అన్నారు. కార్యక్రమంలో డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, రూరల్ సీఐ సీఎం రాకేష్, పట్టణ, రూరల్ ఎస్ఐలు శరత్ కుమార్ రెడ్డి, మమత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**ఆళ్లగడ్డ (శిరివెళ్ల):** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ సూచించారు. సోమవారం పట్టణంలోని పోలీసు స్టేషన్ నుంచి ప్రధాన రహదారి గుండా ర్యాలీ నిర్వహించారు. వాహనదారులు పరిమిత వేగంతో ప్రయాణించడంతో పాటు రహదారి నియమాలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీల్లో విద్యార్థిని ప్రతిభ


కలెక్టరు రాజకుమారి నుంచి బహుమతి అందుకుంటున్న నాగలక్ష్మి

**బనగానపల్లె, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** ఇటీవల వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో టంగుటూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని ఏ.నాగలక్ష్మి ప్రతిభ చూపారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థినికి సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజకుమారి నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని నాగలక్ష్మిని, హెచ్ఎం పర్వీన్‌భాను, ఉపాధ్యాయులు యాగంటి, సూర్యుడు, రాజశేఖర్, సుబ్బారెడ్డి, యాగంటీశ్వరుడు, గోపాల్ రావు, ఓబయ్య, హరినాథ్‌గౌడ్, మహమ్మద్‌రఫీ, రామకృష్ణ, హమీదాబేగం అభినందించారు.

## అహోబిలంలో విశేష పూజలు

**ఆళ్లగడ్డ (శిరివెళ్ల), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** పుణ్యక్షేత్రమైన అహోబిలంలో ధనుర్మాస పూజలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా హనుమ జయంతిని పురస్కరించుకొని శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వామి తిరువడి కొవిల్(బీగాల ఆంజనేయ స్వామి గుడి) వేంచేశారు. ప్రహ్లాదవరదుడికి నవకలశ స్నపన, తిరుమంజనం నిర్వహించారు. ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కీడాంబి వేణుగోపాలన్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

**దొర్నిపాడు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్ఐ వెంకటేష్ సూచించారు. మద్యం తాగి వాహనాలను నడిపితే రూ.10 వేలు జరిమానా, 6 నెలలు జైలు శిక్ష తప్పదని అన్నారు. మద్యం తాగి డ్రైవింగ్ చేసిన వ్యక్తికి మూడు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

**కొలిమిగుండ్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) :** నూతన సంవత్సర వేడుకల పేరుతో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు చేపడతామని కొలిమిగుండ్ల సీఐ రమేష్ బాబు హెచ్చరించారు. సోమవారం సీఐ మాట్లాడు తూ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ప్రధాన రహదారుల్లో కేకులు కట్ చేయడం, మద్యం తాగి వాహనాల్లో ఇష్టానుసారంగా తిరగడం తదితర కార్యక్రమాలు చేపట్టరాదన్నారు. ప్రశాంత వాతావరణంలో ఇళ్ల వద్ద న్యూఇయర్ వేడుకలు జరుపుకోవాలని సూచించారు.

## కౌలుపల్లికి బస్సు సర్వీసు

**ప్యాపిలి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):** డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి చొరవతో మండలంలోని కౌలుపల్లికి బస్సు సర్వీసు ఏర్పాటు చేశారు. సోమవారం మొదటిసారి గ్రామానికి బస్సు రావడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో కోట్లకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని గ్రామస్తులంతా కలసి కోరామని ఆ గ్రామ టీడీపీ నాయకులు శివారెడ్డి తెలిపారు. ఆయన స్పందించి బస్సు సర్వీసు ఏర్పాటు చేయడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## పశుగణనను వేగవంతం చేయండి


మాట్లాడుతున్న ఆళ్లగడ్డ ఉప సంచాలకుడు రమణయ్య

**బనగానపల్లె, డిసెంబరు 30, (ఆంధ్రజ్యోతి):** అఖిల భారత పశుగణనను ఎన్యుమరేటర్లు వేగవంతం చేయాలని పశువర్ధకశాఖ ఆళ్లగడ్డ ఉప సంచాలకులు డాక్టర్ రమణయ్య కోరారు. సోమవారం బనగానపల్లె పట్టణంలోని పశువైద్యశాఖ కార్యాలయంలో ఏడీ మారుతి ఆధ్వర్యంలో మండల పశువైద్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువైద్యశాలలో సిబ్బంది పాడి రైతులకు అందుబాటులో ఉంటూ తమకు నిర్దేశించిన లక్ష్యాలను అం దుకోవాలన్నారు. ఎన్యుమరేటర్లు పశుగణన వేగవంతం చేయాలని కోరారు. ఏడీ మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం ద్వారా కేవలం పెయ్య దూడలు మాత్రమే పుట్టే ఎద సూదులు ప్రతి పశువైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని పాడిరైతులు ఈపథకాన్ని సద్వినియోగం చేసు కోవా లని కోరారు. కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, డాక్టర్ చిన్నబాబు, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ భారతీదేవి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీని బలోపేతం చేస్తాం


పార్టీ మండల అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

**ఉయ్యాలవాడ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి):** మండలంలో బీజేపీని బలోపేతం చేయటానికి కృషి చేస్తామని పార్టీ మండల అధ్యక్షుడు శ్రీరామ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్ష నియామకం చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగన్న మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీని ముందుకు తీసుకెళ్తాన్నారు. శ్రీరామ్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల రిటర్నింగ్ అధికారి వెంకటసుబ్బయ్య, రామయ్య, గురుస్వామి, దస్తగిరిబాష, సంజీవ రాయుడు, శ్రీకాంత్ తదితరులున్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**శిరివెళ్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని శిరివెళ్ల సీఐ వంశీధర్ సూచించారు. శిరివెళ్లలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో సోమవారం సమావేశం నిర్వహించారు. సోషల్ మీడియాలో, గుర్తు తెలియని వ్యక్తులకు బాలికలు వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్నపీరయ్య, ప్రిన్సిపాల్ ఇష్రత్‌బేగం, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

### రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం

**- సుబ్రహ్మణ్యం, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్**



**రుద్రవరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** రుద్రవరం మండలంలో ప్రజలకు రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యమని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలో 16 సచివాలయాలు, 21 గ్రామ పంచాయతీల పరిధిలో 49,003మంది నివాసం ఉంటున్నారు. ప్రతి కుటుంబానికి రక్షిత మంచినీరు అందిస్తామన్నారు. సోమవారం ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడారు.

**ప్రశ్న :** గ్రామాల్లో రక్షిత మంచినీరు అందిస్తున్నారా?

**జవాబు:** ప్రతి కుటుంబానికి రక్షిత మంచినీరు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

**ప్రశ్న:** మండలంలో ఓహెచ్ఆర్ ట్యాంకులు ఎన్ని ఉన్నాయి?

**జవాబు :** మండలంలో 33 ఓహెచ్ఆర్ఎస్ ట్యాంకులు ఉన్నాయి. వీటిలో మందలూరు గ్రామంలో పనిచేయడంలేదు. మిగిలినవన్నింటినీ ప్రజలకందుబాటులో ఉంచాం.

**ప్రశ్న :** మండలంలో ఇన్‌లైన్ క్లోరినేజేషన్ ఎన్నిగ్రామాల్లో ఏర్పాటు చేశారు?

**జవాబు :** ఇన్‌లైన్ క్లోరినేషన్ అన్నిగ్రామాల్లో ఏర్పాటు చేశాం. ఇంకా కొన్ని గ్రామాల్లో ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం,

**ప్రశ్న :** చేతిపంపులన్నీ పని చేస్తున్నాయా?

**జవాబు :** చేతిపంపులు కొన్ని తుప్పుబట్టిపోయాయి. పని చేసే వాటిని అన్నింటినీ ప్రజలకు అందుబాటులో ఉంచాం.

**ప్రశ్న :** కొత్త ట్యాంకులు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారా?

**జవాబు:** కొత్తగా ఓహెచ్ఆర్ఎస్ ట్యాంకులు నిర్మించేందుకు ప్రణాళికలు చేసి నివేదిక పంపించాం.

## న్యాయవాదుల నిరసన


డోన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

**డోన్ రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** డోన్‌లో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతపురం పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది శేషాద్రి మృతికి అనంతపురం త్రీటౌన్ సీఐ వ్యవహరించిన తీరునే కారణమని ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌గౌడు, అసోసియేషన్ కార్యదర్శి కృష్ణప్రసాద్, సహ కార్యదర్శి నాగరాజుగౌడు, ఐఏఎల్ రాష్ట్ర కార్యదర్శి రాగుల రాముడు, సీనియర్ న్యాయవాదులు భాస్కర్‌నాయుడు, శివరామకృష్ణ, నరసింహులు పాల్గొన్నారు.

**కోవెలకుంట్ల :** కోవెలకుంట్ల న్యాయవాద సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించి జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టు ముందు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు తిరుపాలు, ప్రధాన కార్యదర్శి ఓబులేసు, కోశాధికారి నాగేశు, సీనియర్ న్యాయవాదులు తిరుపయ్య, నరసింహులు, విష్ణుమనోహర్‌రెడ్డి, సుధాకర్, రమేశ్ పాల్గొన్నారు.

## ఆర్థిక సంస్కరణల పితామహుడు మన్మోహన్ సింగ్

**డోన్ రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** ఆర్థిక సంస్కరణల పితామహుడు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి అన్నారు. సోమవారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి ప్రధాని హోదాలో మన్మోహన్ సింగ్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లెంపల్లె జనార్దన్, వై.శేఖర్, జీవన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

## సహకార వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

**ప్యాపిలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** సహకార వ్యవస్థ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని ప్యాపిలి, హుసేనాపురం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ఇన్‌చార్జి చైర్మన్లు హరికృష్ణ, విజయభాస్కర్ అన్నారు. సోమవారం మండలంలోని విండో కార్యాలయాల్లో నిర్వహించిన రైతుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం సహకార పరపతి సంఘాలను పూ ర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం సింగల్ విండోలను అన్నివిధాలుగా బలోపేతం చేయడానికి కృషి చేస్తుందని అన్నారు. సహకార బ్యాంకు ఖాతాదారులు ఈకేవైసీ తప్పక చే యించుకోవాలని సూచించారు. సమావేశంలో సీఈవోలు మధుసూదన్, ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది ప్రసాద్‌బాబు, మోహన్, జగదీశ్వరయ్య, ఖాతాదారులు పాల్గొన్నారు.

## ఈకేవైసీ చేయించుకోవాలి

**బనగానపల్లె, డిసెంబరు 30, (ఆంధ్రజ్యోతి):** సొసైటీ సభ్యులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని భానుముక్కల సహకార సంఘం సీఈవో అబ్దుల్ మునాఫ్ అన్నారు. సోమవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సొసైటీల కంప్యూటీకరణలో భాగంగా ఈకేవైసీ ప్రక్రియలను ప్రారంభించినట్లు తెలిపారు. ఎవరైనా తమ వివరాలు నమోదు చేసుకోకపోతే సంక్షేమ పథకాలు వర్తించవన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ షామీర్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించుకోవాలి

**బనగానపల్లె, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ వినియోగించాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆకు కూరలు, కూరగాయల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. స్టాల్‌ను తహసీల్దారు నారాయణరెడ్డి, ఎంపీడీవో రమణ పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## పంటల బీమాకు నేడు ఆఖరు

**కోవెలకుంట్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) :** రైతులు రబీలో సాగు చేసిన పంటలకు మంగళవారంలోగా బీమా చేయించుకోవాలని వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనగ, మినుము తదితర పంటలకు ఇంత వరకు పంట నమోదు చేయించుకోని వారు స్థానిక ఆర్‌బీసీ కేంద్రాలకు వెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు. ఇదే కాకుండా పంటలకు ప్రీమియం చెల్లించి బీమా సౌకర్యం పొందాలని సూచించారు.

## ఏళ్లనాటి సమస్య పరిష్కారం

**కోవెలకుంట్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని సంతమార్కెట్ వీధిలో నెలకొన్న ఏళ్లనాటి సమస్య పరిష్కరించినట్లు ఈవోపీఆర్‌డీ, ఈవో ప్రకాశ్‌నాయుడు అన్నారు. సోమవారం మేజరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈవో మాట్లాడుతూ మూడేళ్ల క్రితం కోవెలకుంట్లలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు మధ్యలో నిలిచిపోయినట్లు తెలిపారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సహకారంతో సీసీ రోడ్డు వేయించినట్లు తెలిపారు. పనులు పూర్తయితే ప్రజల కష్టాలు తీరుతాయన్నారు.